ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి : ఎంఎల్ఎ

గణపవరం : గ్రామాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బలోపేతం చేయాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం జల్లికొమ్మరలో జరిగిన బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాల మోజులో పడి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను దూరంచేయటం మంచిది కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అమలు చేసి విద్యాభివృద్ధికి చేయూత ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. గ్రామాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును నూతనంగా కొనుగోలు చేసిన పంచాయతీ ట్రాక్టర్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుపి పాఠశాల ఉపాధ్యాయులు కటకం సుందర్ కుమార్, సిహెచ్.లీలాగోపాల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ట్రంప్ దెబ్బకు..
ఆక్వా ధమాల్

లబోదిబోమంటున్న రొయ్య రైతులు
కిలో రొయ్య ధర రూ.40 నుంచి రూ.70 వరకూ తగ్గుదల
ఎకరాకు రూ.2 లక్షల వరకూ నష్టం

ప్రజాశక్తి - భీమవరం

ఒడిదుడుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆక్వా సాగు ట్రంప్ టారిఫ్ల యుద్ధతో అతలాకుతలమవుతోంది. అగ్రరాజ్యం అమెరికా విధించిన సుంకం డాలర్ పంటను కుదేలు చేసింది. దీంతో ఆక్వా రంగానికి పెట్టింది పేరుగా ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వా రైతులు లబోదిబోమంటున్నారు. ఒక్కసారిగా రొయ్యల ధరలు కిలో రూ.40 నుంచి రూ.70కి తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

కొన్నాళ్ల నుంచి ఆక్వా సాగు పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. నాణ్యమైన సీడ్ దొరకకపోవడం, ఫీడ్ ధరలు పెరిగిపోవడం, విద్యుత్ ఛార్జీలు పెరిగిపోవడం, వైరస్ ప్రభావం, సాగు వ్యయం రెట్టింపు వంటి వాటితోపాటు రొయ్య ధరను ఎగుమతిదారులు సిండికేట్ అయ్యి తగ్గించడం వంటి సమస్యలతో ఆక్వా రైతులు సతమతమవుతున్నారు. అయినప్పటికీ సాగు సాగిస్తున్న రైతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం పిడుగుపాటులా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. దీనిలో రొయ్యల సాగు సుమారు 1.10 లక్షల ఎకరాలు, చేపల సాగు 1.80 లక్షల ఎకరాల్లో ఉంది. ప్రతియేటా నాలుగు లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో సుమారు 3.5 లక్షల టన్నుల వరకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంసాహార ఉత్పత్తుల్లో రొయ్యలది మూడో స్థానం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాదే సింహభాగం. మొత్తంగా రూ.18 వేల కోట్ల వ్యాపారంలో విదేశీ లావాదేవీల వాటే అధికంగా ఉంది. భారత సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం విధించిన 26 శాతం ప్రతీకార సుంకం ఈ నెల తొమ్మిది నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో సుంకాల ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే రొయ్యల ధరల పతనం ప్రారంభమైంది. కిలో రొయ్య ధర రూ.40 నుంచి రూ.70 వరకూ పడిపోయింది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని ఆక్వా రంగ పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికే ఉన్న 5.76 కౌంటర్ వెల్లింగ్ డ్యూటీ (సివిడి)తోపాటు యాంటీ డంపింగ్ డ్యూటీలను

కూడా కలుపుకుంటే ఈ సుంకాల భారం 33 శాతం నుంచి 35 శాతం వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

రెండు రోజుల్లో రూ.40 నుంచి రూ.70 వరకు ధర పతనం

ఆక్వా ఉత్పత్తులపై అమెరికా సుంకం పెంపుతో జిల్లాలో ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడింది. రొయ్యలు ఆయా కౌంట్లను బట్టి ధర పతనమైంది. 100 కౌంట్ రొయ్య ధర రెండు రోజుల క్రితం రూ.240 ఉండగా తాజాగా రూ.200 నుంచి రూ.190 వరకూ తగ్గిపోయింది. 90 కౌంటు ధర రూ.250 ఉండగా ప్రస్తుతం రూ.210, 80 కౌంట్ రూ.260 ఉండగా రూ.220కు, 70 కౌంట్ ధర రూ.280 నుంచి రూ.240కు, 60 కౌంట్ రూ.290 నుంచి రూ.260కు, 50 కౌంటు రూ.350 నుంచి రూ.300కు, 30 కౌంటు ధర రూ.470 నుంచి రూ.400కు తగ్గిపోయింది. సాధారణంగా 40, 30, 20 కౌంట్లు ఉండే రొయ్యలను మాత్రమే అమెరికాకు ఎగుమతి చేస్తారు. అయితే ప్రతీకార సుంకాన్ని సాకుగా చూపించి ఎగుమతిదారులు అన్ని కౌంట్లపై కిలోకు రూ.30 నుంచి రూ.70 వరకు తగ్గించారు. కొన్నిచోట్ల కొనుగోళ్లు లేవని, ట్రేడర్లు ముందుకు రావట్లేదని రైతులు వాపోతున్నారు. దీంతో సాగుదారులే కాకుండా ఆక్వా రంగంపై ఆధారపడ్డ కూలీల ఉపాధి కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని పరిశీలకులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.2 లక్షల చొప్పున నష్టం

ముడి సరుకు ధరలు తగ్గినప్పటికీ ఫీడ్, సీడ్ ధరలు అధికంగా ఉండడంతో సాగు వ్యయం విపరీతంగా పెరిగి గత ఆరు నెలల నుంచి ఆక్వా రైతులు కష్టనష్టాల మధ్య కొట్టుమిట్టా డుతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ నిర్ణయం ఆక్వా రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. రొయ్యల సాగులో వంద కౌంట్ రావడానికి రూ.230 నుంచి రూ.240 వరకు ఖర్చవుతుంది. ఇది కూడా చెరువులో వేసిన పిల్ల కనీసం 80 శాతం పెరిగితే ఈ ధరకు పెట్టుబడులు వస్తాయి. అయితే వంద కౌంట్ ధర ప్రస్తుతం రూ.200కు పడిపోయింది. ఈ నేపథ్యంలో ఎకరాకు రూ.2 లక్షల చొప్పున నష్టం వాటిల్లే దుస్థితి ఏర్పడనుంది. అయితే ఇది ఇక్కడితో ఆగుతుందా, లేక కొనసాగుతుందా అనే ఆందోళన రైతులను వెంటాడుతోంది.

అమెరికా సుంకంతో ఆక్వా రైతులకు తీవ్ర నష్టం

కె.రాంబాబు, ఎపి సీఫుడ్స్ సప్లయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి

ఆక్వా ఎగుమతులపై అమెరికా 26 శాతం సుంకం విధించింది. దీనివల్ల ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నూటికి 26 శాతం అంటే రైతు కుదేలైపోతాడు. సహజంగా 100 కౌంట్ ధర రూ.240 ఉంటే దీనిలో 26 శాతం అంటే రూ.165 మాత్రమే చేతికి వస్తుంది. ఇది రైతుకి తీవ్రమైన నష్టం కలిగిస్తుంది. ఒకో ఎకరానికి భారీగానే నష్టాలు ఏర్పడుతున్నాయి. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఆక్వారంగ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరతాం.

ఆక్వా అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం

బి.శ్రీరామ్మూర్తి, ఎపి సీఫుడ్ సప్లయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు



రైతు దేశానికి వెన్నెముక. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. ఆక్వా రంగంతోపాటు అనుబంధ రంగాలపై ఆధారపడి ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. రైతులు, కమీషన్ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, కూలి పనులు చేసుకునే వారు ఇలా చెప్పుకుంటూ పోతే అనేకమంది ఉన్నారు. అమెరికా సుంకం విధింపు భారం ఒక్క ఆక్వా రంగంపైనే కాకుండా మిగిలిన అనుబంధ రంగాలపైనా తీవ్ర ప్రభావం పడింది. ఇప్పటికే అనేక ఇబ్బందుల మధ్య ఆక్వా సాగవుతోంది.

ఆక్వా రంగం నిర్వీర్యమయ్యే ప్రమాదం

కలిదిండి సందీప్ వర్మ, ఆక్వా రైతు

ఆక్వా ఎగుమతులపై ట్రంప్ విధించిన 26 శాతం సుంకం రైతులకు తీరని నష్టదాయకం. దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సరైన నిర్ణయం తీసుకోవాలి. సుంకం విధింపు ప్రకటన రోజు నుంచే ధరలు తగ్గడం ప్రారంభమయ్యాయి. రూ.40 వరకు ధరలు తగ్గాయి. ఇంకా ధరలు తగ్గే అవకాశం కూడా ఉంది. రానున్న రోజుల్లో ఆక్వా రంగం కుదేలై నిర్వీర్యమయ్యే ప్రమాదం కూడా ఉంది.

ఇలాగైతే క్రాప్హాలిడే తప్పదు

జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్రాజు

పాలకొల్లు రూరల్: ఆక్వా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోకపోతే క్రాప్హాలిడే తప్పదని జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్రాజు అన్నారు. పూలపల్లిలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా 26 శాతం సుంకం విధించడంతో గడిచిన మూడు రోజులుగా రైతుల నుండి రొయ్యలు కొనుగోలు చేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే అదనుగా కొనుగోలు కంపెనీలు కిలోకు రూ.90 వరకు ధర తగ్గించి రైతుల నడ్డి విరుస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు కూడా ఆక్వా పరిశ్రమపై ఏవిధమైన కనికరం చూపించడం లేదని తెలిపారు. రొయ్యల మేతకు ఉపయోగించే సోయ, తౌడు రేట్లు తగ్గినా మేత ధరలు తగ్గించకుండా కంపెనీలన్నీ కుమ్మక్కయ్యాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆక్వా రైతులు క్రాప్హాలిడే ప్రకటించడం తప్ప వేరే దిక్కు లేదని స్పష్టం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఆక్వా రైతులను ఆదుకుని నిలబెట్టాలని కోరారు. ఆక్వా పరిశ్రమను నిలబెట్టకపోతే దానిపై ఆధారపడిన అనేకమంది రోజువారీ కూలీలు, కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచంట, పాలకొల్లు పోడూరు తదితర మండలాల్లోని ఆక్వా రైతులతో ఈ నెల ఏడోతేదీన పూలపల్లి వై.జంక్షన్లో పెద్దఎత్తున ఆక్వా రైతు సభ నిర్వహిస్తామని గాంధీ భగవాన్రాజు తెలిపారు. సమావేశంలో ఆక్వా రైతులు పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు, సజ్జ బుజ్జి, సుధీర్రెడ్డి, బోనం వెంకట నరసయ్య, అంగర వరప్రసాద్, మేక ఫణీంద్రప్రసాద్, గుంటూరు సత్యనారాయణరాజు, దాట్ల సోంబాబు, బోనం రంగయ్యానాయుడు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకంపై ప్రభుత్వాలు మౌనం వీడాలి

జిల్లాలో ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వీడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్ అన్నారు. జిల్లాలో ఆక్వా రంగాన్ని కాపాడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆధిపత్య ధోరణితో ఇష్టానుసారం వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. దీనిలో భాగంగానే అమెరికాతో వ్యాపార సంబంధాలు ఉన్న అన్ని దేశాలపైన సుంకాలు విధిస్తున్నారని విమర్శించారు. ప్రతి వస్తువుపై ఈ సుంకం ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. దీని ప్రభావం ఆక్వారంగంపై పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రకటనతో గంటల వ్యవధిలోనే ఆక్వా ధరలు పతనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు ధరలు తగ్గాయని తెలిపారు. కొన్నిచోట్ల కొనుగోళ్లు కూడా లేవని, ట్రేడర్లు ముందుకు రాని పరిస్థితి ఉందని, దానివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనలపై ప్రధాని మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం స్పందించకపోవడం అన్యాయమని విమర్శించారు. నష్టపోతున్న ఆక్వా రైతులను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మహనీయులు బాబూ జగ్జీవన్రామ్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

కలెక్టరేట్లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పి, జెసి, నేతలు

ప్రజాశక్తి - భీమవరం

బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, కార్మికుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయులు బాబూ జగ్జీవన్రామ్ అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం బాబూ జగ్జీవన్రామ్ 118వ జయంతి సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మీ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్కుమార్రెడ్డి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తూనే కుల నిర్మూలన ఉద్యమాలు నడిపిన గొప్ప నాయకులు బాబూ జగ్జీవన్రామ్ అన్నారు. రాజకీయ రంగంలోనూ ప్రవేశించిన ఆయన వివిధ పదవుల్లో సమర్థవంతంగా పని చేశారన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థను ప్రవేశపెట్టి శాశ్వతంగా ఆహార సమస్యకు పరిష్కారం చూపారన్నారు. కార్మికుల కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. వారి స్ఫూర్తితో ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నారు. ఎస్పి అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ బాబు జగ్జీవన్రామ్ చాలా గొప్ప వ్యక్తి అని, దేశ చరిత్రలో సుమారు 30 ఏళ్లు కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా పని చేయడం ఎంతో గర్వకారణమన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్కుమార్రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సమానత్వంతో ఉండాలనే లక్ష్యంతో బడుగు, బలహీన వర్గాలతోపాటు స్త్రీలకు విద్య విషయంలో అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. డివిఎంసి సభ్యులు చీకటిమిల్లి మంగరాజు, పొన్నమండ బాలకృష్ణ, తెన్నేటి జగ్జీవన్, బంగారు కరుణరాజు, తాడికొండ జయకృష్ణ, సత్య సుధామ, న్యాయవాది విజయరాజు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిక అధికారి బివిఎస్బి.రామాంజనేయరాజు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు, తణుకు మున్సిపల్ కమిషనర్ రామ్కుమార్, ఎఎస్డబ్ల్యూఒ సిహెచ్.భానుమతి, సూపరింటెండెంట్ ఎస్ఎన్వి.సత్యనారాయణ, వసతిగృహ సంక్షేమాధికారులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కాళ్ల: బాబూ జగ్జీవన్రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జగ్జీవన్రామ్ జయంతిని వేంపాడు గ్రామంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ నాగరాణి జగ్జీవన్రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి



కాళ్ల మండలం వేంపాడులో..

నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి యిర్రింకి పద్మావతి, పంచాయతీ కార్యదర్శి సుంకర వెంకటేష్, ఎంపిడిఒ జి.స్వాతి, ఇఒపిఆర్డి భాస్కర రావు, ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు, తహాశీల్దార్ జి.సుందర్ సింగ్, మదర్ థెరిస్సా యూత్ కమిటీ సభ్యులు, వేంపాడు పంచాయితీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'వక్ఫ్' సవరణకు వ్యతిరేకంగా సిపిఎం నిరసన

ప్రజాశక్తి - పెంటపాడు



నినదిస్తున్న సిపిఎం నేతలు, ముస్లిం పెద్దలు

మైనార్టీల హక్కులను హరిస్తున్న వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మసీదు వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకుడు మహబూబ్ జానీ, సిపిఎం మండల కార్యదర్శి సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో షేక్ సిరబ్, షేక్ రుత్తాని, షేక్ సందాని, మహ్మద్ షరీఫ్, పెనగంటి దుర్గ, తెర్లి రాజేష్, సలుమూరి సత్యనారాయణ, బంకురు చిన్న, ఆదిరెడ్డి సత్యనారాయణ, పైలి ప్రసాద్, సాయి, మణికంఠ, నరేష్, రమేష్ పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు ప్రణాళిక

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
మున్సిపల్ కమిషనర్లతో జెసి రాహుల్కుమార్రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

వేసవి దృష్ట్యా జిల్లా ప్రజలకు తాగునీరు అందించేందుకు పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్కుమార్రెడ్డి ఆదేశించారు. జన సమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు, మజ్జిగ అందించాలన్నారు. శనివారం కలెక్టరేట్లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, పిఎం సూర్యఘర్, పింక్ టాయిలెట్ల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి అంశాలపై ఆయన సమీక్షించారు. జెసి మాట్లాడుతూ ఇళ్ల నుండి చెత్త సేకరణ బాగానే జరుగుతుందని, అయితే తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ మందకొడిగా సాగుతోందన్నారు. జిల్లాలో ఎక్కడా తాగునీటికి కొరత లేకుండా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను పూర్తిగా నింపుకోవాలన్నారు. ఎక్కడైనా తాగునీటి సరఫరాకు ఏమైనా ఇబ్బందులు వస్తే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో మినరల్ వాటర్ సరఫరా చేస్తున్న ప్రయివేట్ యూనిట్లను తనిఖీ చేసి నీటి క్వాలిటీని పరిశీలించాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా జన సమూహాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో షామియానాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేసి

మాట్లాడుతున్న జెసి రాహుల్కుమార్రెడ్డి

తాగునీరు, మజ్జిగ ప్రజలకు అందించే ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముఖ్యమైన ప్రదేశాల్లో బ్యానర్లు, వాల్పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలన్నారు. పిఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే వారికి లభించే సబ్సిడీ, సొమ్ము ఆదా వంటి అంశాలపై ప్రజలు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు కె.రామచంద్రారెడ్డి, ఎం.ఏసుబాబు, టి.రామ్కుమార్, ఎం.అంజయ్య, జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తి యువతకు ఆదర్శం

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఘన నివాళి

ప్రజాశక్తి - భీమవరం

బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్సి బొర్ర గోపీమూర్తి అన్నారు. జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఎల్సి గోపీమూర్తి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ 40 ఏళ్ల పాటు పార్లమెంటు సభ్యుడుగా, కేంద్ర ప్రభుత్వంలో వివిధ మంత్రిత్వ శాఖలలో 30 ఏళ్ల మంత్రిగా, ఉప ప్రధానిగా పనిచేశారని గుర్తు చేశారు. దేశాభివృద్ధికి, బడుగు బలహీన తరగతుల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. ఆయన స్ఫూర్తిని నింపుకొని యువత ఆదర్శంగా పనిచేయాలని అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ పేదలకు ఎనలేని సేవ చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య ఈనాటి నాయకత్వం బాబు జగ్జీవన్ ఆశయాలకు అంకితమై పనిచేయడమే ఆయనకు ఇచ్చే నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.ఏసుబాబు, ప్రాంతీయ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.దుర్గా భవానీప్రసాద్, బి.నాగబాబు, ఎన్.నరసింహయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి పి.సీతారామరాజు, యుటిఎఫ్ కార్యకర్తలు ఇ.గోపాల రాజు, ఎం.ఫణి శేఖర్, పిల్లి శ్రీనివాస్, టి.తిలక్, జె.గంగాధరరావు, ఎ.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్సి గోపీమూర్తి

గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలి

ఆంధ్రప్రదేశ్ గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి

ప్రజాశక్తి - తణుకు

ధర్నా నిర్వహిస్తున్న గీత కార్మికులు

గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులకు వ్యతిరేకంగా గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం తణుకు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఎక్సైజ్ అధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో గీత కార్మికులు కల్లు అమ్మకాలు లేక కల్లును వలకబోసుకుంటున్నారని, దీనికి కారణం గ్రామాల్లో ఏర్పడిన లిక్కర్ బెల్ట్ షాపులు అని అన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను అధికారులు అరికట్టకుండా ప్రోత్సహిస్తున్నారని మునిస్వామి అన్నారు. ప్రకృతి సిద్ధంగా వచ్చే కల్లును గీత కార్మికులు తీసుకొని, అమ్ముకొని వాళ్ల కుంటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. బెల్ట్ షాపుల వల్ల గీత కార్మికులు పూర్తిగా ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గీత వృత్తికి సమగ్రమైన చట్టం చేయకుండా, జిఒ 560 ప్రకారం సొసైటీలకు ప్రభుత్వ భూములను 5 ఎకరాలు ఇవ్వకుండా ప్రభుత్వం గీత కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని మునిస్వామి తెలిపారు. కార్మికులు ప్రమాదవశాత్తూ వృత్తిలో మృతి చెందినా, వికలాంగులైనా ఎక్స్గ్రేషియా ఉండేదని, ఇప్పుడు దానిని రద్దు చేశారని అన్నారు. తెలంగాణా ప్రభుత్వం గీత కార్మికులకు ఎక్స్గ్రేషియా రూ.10 లక్షలు ఇస్తుందని, మట్టి ఖర్చులు కింద రూ.20వేలు ఇస్తుందని తెలిపారు. మన రాష్ట్రంలో గీత కార్మికులకు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం రావడం లేదని మునిస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో గీత కార్మికులను ఆదుకుని, గ్రామాల్లో బెల్ట్ షాపులను అరికట్టాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమౌతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కాసాని శీను, పాల సత్యనారాయణ, కట్టా వెంకటేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.

నమ్మకం.. నయవంచన..!

మరో యువతి లైంగిక వేధింపులు, నయవంచన భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. తన తల్లిదండ్రులకు తాను అల్లారుముద్దుగా పెంచుకున్న ఏకైక ముద్దుబిడ్డ అని తెలిసినా బలవన్మరణానికి పాల్పడిందంటే నయవంచకుని వేధింపులు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఏలూరులో ఒంటరి మహిళను డబ్బు కోసం బంధువే చంపడంతోపాటు మృతదేహంపై పెట్రోల్ పోసి కాల్చేసే ప్రయత్నం చేయడం అకృత్యాలకు అడ్డుకట్ట పడేదెప్పుడు అనే చర్చ సర్వత్రా సాగుతోంది.

జీలుగుమిల్లి మండలం రౌతుగూడేనికి చెందిన నాగాంజలి మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. రాజమండ్రిలో ఓ ఫార్మసీ విద్యాసంస్థలో ఫార్మసీ చదువుతున్న నాగాంజలి ఇంటర్న్షిప్ నిమిత్తం అదే నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో పని చేస్తోంది. అదే ఆసుపత్రికి చెందిన ఎజిఎం దీపక్ ప్రేమ పేరుతో నమ్మించి వంచించాడు. లైంగిక దాడులతోపాటు వేధింపులు తట్టుకోలేక నాగాంజలి మోతాదుకు మించి మత్తు ఇంజెక్షన్లు తీసుకుని బలవన్మరణానికి పాల్పడింది. 12 రోజులపాటు అదే ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడిన ఆమె అలసి కన్నుమూసింది. దీనిపై ఐద్వా, ఇతర ప్రజాసంఘాల ఆందోళనతో కదిలిన పోలీసులు దీపక్ను అరెస్టు చేసి రిమాండ్కు పంపారు. అయితే అదే జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నాగాంజలి మృతి తర్వాత కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రకటించడం తప్ప ముందస్తుగా ఏవిధంగానూ స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. నాగాంజలి భౌతికకాయాన్ని కడసారి చూసేందుకు రాజమండ్రిలో ప్రజాసంఘాల నేతలను అనుమతించకపోవడం గమనార్హం. ఇప్పటి వరకూ అసలు ఆస్పత్రిలో ఏం జరిగిందనే దానికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజీలను పోలీసులు బయట పెట్టకపోవడంపై అంతా మండిపడుతున్నారు. దీపక్ అకృత్యాలకు నాగాంజలినే బలైందా, లేక ఇంకా ఎవరైనా బాధితులున్నారా అనేది తేల్చాలని, దీపక్ను కఠినంగా శిక్షించడంతోపాటు నాగాంజలి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. అయితే గతంలో నిర్భయ్, తర్వాత

దిశ, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చట్టాలున్నా మహిళలపై అఘాయిత్యాలకు ఎందుకు అడ్డుకట్ట పడటం లేదనే చర్చ మరోసారి నాగాంజలి మృతితో ప్రారంభమైంది. ఇటీవల కాలంలో జిల్లాలో మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలే ఏలూరు నగరంలో ఒంటరి మహిళను సమీప బంధువు డబ్బు కోసం హత్య చేసి, ఆపై పెట్రోలు పోసి కాల్చేసే ప్రయత్నం చేయడం అందరికీ తెలిసిందే. గతంలో పట్టపగలే ప్రయివేటు స్కూల్ టీచర్ను ప్రేమోన్మాది కత్తితో నరికి హత్య చేశాడు. పని కోసం నగరానికి వచ్చిన మహిళపై మందుబాబులు అత్యాచారానికి పాల్పడ్డారు. మొత్తంగా చూస్తే ఇంట్లోనూ, పని ప్రదేశాల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ ఎక్కడా మహిళలకు రక్షణ లేదనేది ఈ ఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. కేవలం ఘటన జరిగినప్పుడు అధికారులు హడావుడి చేసి సరిపెట్టకుండా ఘటనల వెనుక కారణాలు, వాటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఆ దిశగా పాలకులు ఎప్పటికి చర్యలు తీసుకుంటారో.. అకృత్యాలు, అఘాయిత్యాలు ఎప్పటికి ఆగుతాయో వేచిచూడాల్సిందే.

ఇక ఆప్కాస్ను రద్దు చేయొద్దంటూ రెండు జిల్లాల్లోని మున్సిపల్ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. దీనిపై ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ చర్చ సాగింది. గత ప్రభుత్వ విధానాలు మార్చడమే పనిగా కాకుండా అందులో ప్రధానంగా కార్మికులకు గతంతో పోలిస్తే ఎంతోకొంత ఉపయోగంగా ఉన్న ఆప్కాస్ను రద్దు చేయొద్దనేది కార్మికుల ప్రధాన డిమాండ్. ఆప్కాస్ను రద్దు చేస్తే ఔట్సోర్సింగ్ ఉద్యోగుల భవిష్యత్తు మళ్లీ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీనివల్ల ఆయా ఉద్యోగ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయి. అలాకాకుండా కార్మికులకు ఉపయోగంగా ఉన్న ఆప్కాస్ను కొనసాగిస్తూనే మరింత మెరుగ్గా దాన్ని తీర్చిదిద్దాలని కార్మికులు కోరుతున్నారు. అలాకాకుండా ప్రభుత్వం గుడ్డిగా ఆప్కాస్ను రద్దు చేస్తే కార్మికులకు నమ్మక ద్రోహం చేసినట్లేనని కార్మిక నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

-విఎస్ఎస్వి.ప్రసాద్

20, 21 తేదీల్లో ఎపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభ ఈనెల 20, 21వ తేదీల్లో కృష్ణాజిల్లాలోని కొండపల్లిలో జరుగుతుందని, జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మడకరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు యండమూరి నాగేంద్ర మాట్లాడుతూ 20న భారీ బహిరంగ సభ కొండపల్లి గ్రౌండ్లో, 21న ప్రతినిధుల సభ శ్రీముత్తవరపు వెంకటేశ్వరరావు కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రజక సోదరులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

ఫ్రైడే డ్రైడే పాటించండి

మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు

గణపవరం : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించి ఆరోగ్యరక్షణ పొందాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. శనివారం గణపవరం పంచాయతీ పరిధిలోని జగన్నాధపురంలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇంట్లో ఎవరికైనా సాధారణ జ్వరమైనా అశ్రద్ధ చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. స్థానిక మండలపరిషత్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు కీటకజనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్త రమాదేవి, ఆరోగ్యసహాయకులు యేహాన్ కృష్ణ, జి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు వి.వి.త్రినాథ్, కృష్ణకుమారి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

గణపవరం : మండలంలో కొమ్మర గ్రామంలో శనివారం ఎంజిఎన్ఆర్ఇజిఎస్ రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. రోడ్లతో పాటు ప్రజలకు మంచినీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వీరమాచినేని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మే 20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

సిఐటియు నేత జవ్వాది శ్రీనివాస్

యలమంచిలి : కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులను వ్యతిరేకంగా, బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ మే 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు నేత జవ్వాది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఉమా నరసింహా కళ్యాణ మండపంలో అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన, భవన నిర్మాణ కార్మికుల సంయుక్త సమావేశం సిఐటియు మండల అధ్యక్షులు కె.శ్రీవల్లిని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులను జీవించే హక్కును హరించే విధంగా వ్యవహరిస్తోందని, రోజుకి ఎనిమిది గంటల పని పద్ధతిని తీసేసి 10 గంటలు పెట్టడం వంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతుండడం దురదృష్టకరమని, ఇటువంటి చర్యలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, నాయకులు కాకిలే బాలరాజు, పద్మశ్రీ, చిన్ని తల్లి, నాగలక్ష్మి, నిర్మల కుమారి, సుధారాణి, హేమలత, స్వాతి జ్యోతి, పెద్దింట్లు, మంగ, హారిని పాల్గొన్నారు.

గందరగోళంలో ఆకివీడు ఎఎంసి..!

ఆకివీడు : ఆకివీడు ఎఎంసి కమిటీ నియామకం పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందా అని ప్రజల్లో అనేక సందేహాలు వినిపిస్తున్నాయి. జిల్లాలోనే అతిపెద్ద మార్కెట్ యార్డ్ అయిన ఆకివీడు యార్డ్ కమిటీ నియామకం ముందు వరుసలో ఉంటుందని అందరూ భావించారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రకటించిన రోస్టర్ విధానంలో ఆకివీడు యార్డ్ కమిటీ బిసిలకు రిజర్వ్ చేసినట్లు చెప్పారు. ఆమేరకు టిడిపిలో సీనియర్ బిసి నాయకులు జాబితాలు అప్పటికే లెక్కలు మొదలుపెట్టారు. వారిల్లో ఆగ్రస్థానంలో బొల్లా వెంకట్రావు పేరు వినిపిస్తుంది. మండలం నుండి అంతకన్నా ఎవరి పేరు బిసిలో వినబడిన వారు జూనియర్లు అవుతారని ఇక్కడ గణాంకాలు. అంతలోనే ప్రకటనలు మొదలయ్యాయి. అయితే మొదటి జాబితాలో ఆకివీడుకి స్థానం లభించకపోవడంతో కొంతమంది ఆలోచనలు అటు ఇటు పరిగాయి. సుమారు పది రోజుల తేడాలో రెండో జాబితా విడుదల చేసిన ఈ జాబితాలో కూడా ఆకివీడు పేరు లేకపోవడం పలు సందేహాలు తావిస్తోంది.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వీరవాసరం : ఇటీవల అండలూరు గ్రామంలో మృతిచెందిన వారి కుటుంబాలను భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామంజనేయులు(అంజిబాబు), ఎంఎల్సి కవురు శ్రీనివాస్‌లు శనివారం పరామర్శించారు. టిడిపి నాయకులు మన్నె శ్రీనివాస్ సోదరుడు మన్నె సత్యనారాయణ కుటుంబాన్ని, కాటూరి కృష్ణప్రసాద్ కుటుంబాన్ని ఎంఎల్ఎ, ఎంఎల్సిలు పరామర్శించారు. ఈయన వెంట ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, టిడిపి నాయకులు రాయపల్లి వెంకట్‌లు ఉన్నారు.

ఎఎంసి చరిత్రలో బిసిలకు తొలి అవకాశం

బిసిల పక్షపాతి మంత్రి రామానాయుడుకు రుణపడి ఉంటాం

పాలకొల్లు : ఎఎంసి చరిత్రలో ఛైర్మన్ పదవి బిసిలకు అవకాశం రావడం ఇదే తొలిసారి అని, అందుకు బిసిల పక్షపాతి మంత్రి రామానాయుడుకు బిసిలు రుణపడి ఉంటారని టిడిపి బిసి నాయకులు స్పష్టం చేశారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్‌గా బిసి తరగతికి చెందిన కోడి విజయభాస్కర్ పేరును ప్రభుత్వానికి మంత్రి రామానాయుడు పంపినందుకు కృతజ్ఞతగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంగర మాట్లాడుతూ బిసిల సంక్షేమాభివృద్ధి కోసం ఆనాడు ఎన్‌టిఆర్ స్థాపించిన పార్టీ టిడిపి అన్నారు. పార్టీ ఆశయాలకనుగుణంగా పనిచేసే మంత్రి రామానాయుడు ఎల్లప్పుడూ బిసిల అభివృద్ధి కోసమే పాటుపడ్డారని తెలిపారు. తొలిసారిగా ఎఎంసి ఛైర్మన్ పదవి బిసిలకు వచ్చిందంటే మంత్రి నిమ్మల రామానాయుడుకు బిసిల పట్ల ఉన్న అభిమానమేనని తెలిపారు. మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బిసి సంఘ నాయకులు కడలి గోపి, ధనాని సూర్య ప్రకాష్, కుక్కల సత్యనారాయణ, అందె కోటి వీరభద్రం మాట్లాడారు.

శ్రీమావుళ్లమ్మ ఆలయానికి రూ.50 వేల విరాళం

భీమవరం టౌన్ : శ్రీమావుళ్లమ్మ ఆలయానికి విజయవాడకి చెందిన వై.శ్రీనివాసరావు, దీప్తి దంపతులు రూ.50 వేలు విరాళంగా శనివారం ఆలయ సహాయ కమిషనర్, ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కి అందజేశారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదం అందజేశారు.

నేరాలు – ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆకివీడు: భార్యాబిడ్డల్ని ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకు వెళదామని బయలుదేరిన వ్యక్తి ఆసుపత్రి దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా స్కూటర్ వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం శనివారం సాయంకాలం స్థానిక పెద్దపేట్టకు చెందిన మైకేల్ రాజు ఆసుపత్రిలో ఉన్న భార్య, కొడుకును ఇంటికి తీసుకెళ్లడానికి వచ్చాడు. సరిగ్గా ఆసుపత్రికి దగ్గర్లో ఉండగానే ఎదురుగా స్కూటర్ వచ్చి ఢీకొంది. దీంతో మోటార్ సైకిల్ పై నుంచి కింద పడ్డ మైకేల్ రాజు తలకి పెద్ద గాయాలు అవ్వడంతో అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్స్ ఎక్కిస్తుండగానే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హెచ్.నాగరాజు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

మొగల్తూరు : వ్యక్తి అదృశ్యమైన సంఘటనపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం గ్రామీణ మండలం చిట్టవరం గొంది గ్రామానికి చెందిన చల్ల నాగాంజనేయులు మొగల్తూరు లోని మెరైన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 4న ఉదయం ఇంటి వద్ద నుంచి ఇక్కడ కంపెనీకి వచ్చి విధులకు హాజరయ్యాడు. తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీనిపై ఆయన తండ్రి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్

7 మద్యం సీసాల స్వాధీనం

పాలకొల్లు : పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన దాడులలో పోడూరు మండలం, పండితవల్లూరు గ్రామంలో జి.శ్రీనివాసు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ హెచ్చరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఉండి: అత్యాధునిక డ్రోన్ కెమెరా ఉపయోగించి మండలంలోని కోలమూరు, పాందువ్వ గ్రామాలలోని పేకాట స్థావరాలపై ఉండి పోలీసులు దాడి చేసి 9 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,390 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ మహమ్మద్ నశీరుల్లా తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా పలుచోట్ల బాబు జగ్జీవన్ రామ్ జయంతి

పాలకొల్లు : మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి – పాలకొల్లు

దేశానికి దశ, దిశ నిర్దేశించిన మహానుభావుడు బాబు జగజ్జీవన్ రామ్ అని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ తరపున కేక్ కట్ చేసి మంత్రి మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తితో జగజ్జీవన్ దాదాపు కేంద్రంలో ముఖ్య శాఖలు అన్ని సమర్థవంతంగా నిర్వహించారని చెప్పారు. దేశానికి ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా కాంగ్రెస్ కుట్ర రాజకీయాల వల్ల ప్రధాని కాలేకపోయారన్నారు. పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ కార్యాలయం గాంధీ భవనంలో మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు యడ్ల శివాజీ, కె.ప్రభు దాసులు జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక గాంధీ బొమ్మల వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేశారు. తదనంతరం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకులు యడ్ల శివాజీ, మడగల గోపాల్ రావు, కొలుకులూరి అర్జున్ రావులు మాట్లాడారు. బోనం వెంకట్రావు, రూంకానీ శ్రీనివాసరావు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉండి : భారత మాజీ ఉపరాష్ట్రపతి బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలను మండలంలోని వాంద్రం గ్రామంలో ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ గౌరవ అధ్యక్షులు కనపాల యేసు అధ్యక్షతన జరిగిన జయంతి వేడుకలలో జిల్లా అధ్యక్షులు పసల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. జగ్జీవన్ రామ్ దేశ ఉప ప్రధానిగా, ఉపరాష్ట్రపతిగా అనేక సేవలందించారని కొనియాడారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల మండల గౌరవ అధ్యక్షుడు కనపాల శ్యామ్, భీమవరం మండల ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆకుమర్తి రత్నం, కాళ్ల మండల అధ్యక్షుడు కనపాల బాబురావు, ఉండి మండల ఉపాధ్యక్షుడు కాపా రెడ్డియ్య, జగ్జీవన్ రామ్ కమిటీ సభ్యులు కాపా చిన్ని, కనపాల పల్లయ్య, కనపాల నరసన్న, కనపాల సత్యనారాయణ, లక్కవరపు తేజ, సవరపు మోసే, గరికముక్కల సామ్యేలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : సామాజిక సంఘ సంస్కర్తగా దేశానికి అనన్య సేవలు అందించిన దార్శనికుడు బాబూ జగజ్జీవన్ రామ్ అని మార్టేరులోని ఎన్‌జి రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్, ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. మొదటగా బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు : దేశ ఉపప్రధానిగా, కేంద్ర మంత్రిగా బాబు జగ్జీవన్‌రామ్ చేపట్టిన పదవులకు వన్నె తెచ్చిన మహనీయుడు అని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి


తణుకు : మాట్లాడుతున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

సందర్భంగా తణుకు ఎన్‌టిఆర్ పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని నెలకొల్పే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు రూరల్ యాళ్లవాని గరువులో పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు(గోపి) ఆధ్వర్యంలో పాలకొల్లు వైసిపి కార్యాలయంలో జగ్జీవన్ రావు చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆచంట : బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు తాళం శ్రీనివాసరావు, ఎర్రగొప్పుల నాగరాజు, సర్పంచులు జక్కంశెట్టి చంటి, గణేశుల శేషవాణి సుబ్బారావు, నేలపూడి బేబి రామ్మోహన్ రావు, కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సుంకర సీతారాం పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని కేపీ పాలెంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను శనివారం ఎంఆర్‌పిఎస్ నాయకులు కారుమంచి జీవరత్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ బొమ్మిడి నాయకర్ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేళం బన్ను, అందే దొరబాబు, తిరుమణి లక్ష్మీనరసింహం, పడవల సత్యనారాయణ, దాసరి బాబి, సత్తినేని త్రినాధ్ ఉన్నారు.

తాడేపల్లిగూడెం : బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ నియోజకవర్గంలోని కృష్ణయ్యపాలెం, పడాల, పెంటపాడు ఎస్‌సి పేట, ఉమామహేశ్వరం, యాగర్లపల్లి పలుగ్రామాలలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కృష్ణయ్యపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.గోపాల్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లి గూడెం బార్ అసోసియేషన్ హాల్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయ్ కృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11వ అదనపు జిల్లా జడ్జి సికిందర్ బాషా, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సూర్యకిరణశ్రీ, ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి అంధతి, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నరసాపురం: నరసాపురం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో జయంతి వేడుకలు దళిత సంఘాల నాయకులు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, నాయకులు ముస్కుడి రత్నం, కోడేళ్ల వెంకట్రావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

ఉండి: మండలంలోని పాందువ్వ గ్రామంలో కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండలాధ్యక్షులు మాదాసి గోపి మాట్లాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎస్.గంగయ్య, ఎం.రామయ్య, సిహెచ్.చిట్టిబాబు, ఎం.ప్రశాంత్, ఎస్.మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ


పెనుగొండ : విగ్రహాలు ఆవిష్కరిస్తున్న సర్పంచి సోనీ

పెనుగొండ : వాడవాడలా దళిత కుటుంబాలు పండగ వాతావరణం నెలకొన్నాయని పెనుగొండ సర్పంచి శ్యామల సోనీ అన్నారు. శనివారం పెనుగొండలో మారమ్మ గూడెంలో మాజీ ఉప రాష్ట్రపతి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని, భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్యామల సోనీ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ క్యాబినెట్లో అనేక పదవులు నిర్వహించారని కొనియాడారు. ఈ విగ్రహాలకు సూచిక ప్రతి ఒక్కరూ చదువుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికని అన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. జెడ్‌పిటిసి కోడూరు గోవర్ధన్ పాల్గొన్నారు.


వీరవాసరం : విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ

వీరవాసరం : దేశం గర్వించదగ్గ నేత జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని తోలేరు పంచాయితీ పరిధిలోని కొండేభట్లచెరువు గ్రామంలో జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఎంఎల్ఎ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా పనిచేసిన ఆయన బడుగు, బలహీన, పేదల అభ్యున్నతికి ఎనలేని సేవలందించారన్నారు. అటువంటి మహనీయున్ని భవిష్యత్ తరాలు గుర్తించుకునే విధంగా నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల గ్రామ కమిటీని ఎంఎల్ఎ అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వేండ్ర లీలావెంకటకృష్ణ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, తోలేరు నీటిసంఘం అధ్యక్షులు యిర్రింకి బలరామూర్తి, ఉప సర్పంచి భోగిరెడ్డి శ్రీనివాసరావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ యరకరాజు హరిబాబు, చినబాబు, కట్రాడ శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యే శ్రద్ధ వహించాలి

శిక్షణ డిఎస్‌పి కె.మానస

మొగల్తూరు : విద్యార్థుల పట్ల వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని శిక్షణ డిఎస్‌పి కె.మానస సూచించారు. మొగల్తూరులోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 37వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు, దుర వ్యసనాలకు గురవ్వకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని ఆమె అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ మాట్లాడుతూ ప్రతిభా పాఠశాలను ఉన్నత ఆశయాలతో నెలకొల్పి 37 ఏళ్లుగా కొనసాగించడం అభినందనీయమని అన్నారు. ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు, వైద్యులు, ఇంజనీర్లు ప్రముఖ రంగాలలో సేవలు అందిస్తున్నారని అన్నారు. విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయుడు భావనకు సాహితీ మెమోరియల్ అవార్డు రూ.5 వేల నగదు, జ్ఞాపికను, జీవి పట్టాభి వెంకటరమణ మెమోరియల్ సంస్థ ఆధ్వర్యంలో గాది వెంకటేశ్వరరావు నగదు, జ్ఞాపికను అందించారు. శిక్షణ డిఎస్‌పి కె.మానస, ఎస్ఐలు జి.వాసు, వై.నాగలక్ష్మి, ఎంఇఒ యు.శామ్యూల్ జాన్, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులను పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహ్లాదంగా ఆటపాటలతో గడిపారు. పాఠశాల ఆవరణలో సహపంతి భోజనాలు చేశారు. పాఠశాల హెచ్‌ఎం మాలే సుష్మ, అడ్డల సాయికుమార్, అడబాల అనంతలక్ష్మి, జంప నాగదుర్గ, ఆకన లోషిత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'పరిశోధనలకు పునాది సైన్స్'

తాడేపల్లిగూడెం : పరిశోధనలకు పునాది సైన్స్ అని ఎపి నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్ మెంట్ డాక్టర్ వి.సందీప్ సూచించారు. నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు రాజమండ్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంఎస్‌సి కెమిస్ట్రీ విభాగానికి చెందిన 33 మంది విద్యార్థులు శనివారం ఎపి నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ దేశ ప్రగతికి, పురోభివృద్ధికి పరిశోధనలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. శాస్త్రవేత్తలు ఒక గొప్ప వైజ్ఞానిక ప్రాజెక్టు కోసం ప్రయోగశాలలో ఏళ్ల తరబడి అంకితభావంతో పనిచేస్తారని, వారి స్ఫూర్తితో విద్యార్థులు కళాశాల స్థాయిలోనే సరికొత్త ఆలోచనలతో నవకల్పనకు బాటలు వేసుకోవాలని సూచించారు. ముందుగా విద్యార్థులు సైన్స్ ప్రయోగశాలలను సందర్శించి అక్కడ జరుగుతున్న పరిశోధనలు, ప్రాజెక్టుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మూర్తి, శర్మ, రంగారావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు బస్‌పాస్‌లు

తాడేపల్లిగూడెం : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పాసైన విద్యార్థులకు సోమవారం నుంచి బస్‌పాస్‌లు ఇవ్వబడునని తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెకండ్ ఇంటర్ విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

కాళ్ల : పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని కొలనపల్లి చెరువులో పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ మూడు నెలల నుంచి పనిచేస్తున్న డబ్బులు రాలేదని తెలిపారు. ఒకపక్క ఎండలు ముదిరిపోతున్నా పని ప్రాంతాల్లో ప్రభుత్వం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, రామకృష్ణలు మాట్లాడుతూ కోట్లకు అధిపతులైన ఎంఎల్ఎలు, ఎంపీలు వేతనాలు వారి అకౌంట్లో జమ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెక్కల నమ్ముకుంటున్న ఉపాధి కూలీల వేతనాలు జనవరి నుంచి నేటికీ మూడు నెలలు గడుస్తున్నా జమచేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెండింగ్ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేని యెడల జిల్లావ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం సంఘ సభ్యత్వ నమోదు నిర్వహించారు. **తణుకు రూరల్** : గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు బతుకు భరోసానిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని అనేక రకాల ఆంక్షలు విధిస్తూ నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు విమర్శించారు. ఇరగవరం మండలం ఎర్రయి చెరువు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారితో కొద్దిసేపు ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేసిన పనికి రెండు నెలలు పైబడి కూలి డబ్బులు రావడంలేదని, కూలి పని చేసుకుని బతికే మాలాంటి వాళ్లు ఏమి తిని బతకాలని కూలీలు వీరభద్రరావు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ మండుటెండలో కష్టపడి పనిచేస్తున్న ఉపాధి కూలీలకు గత మూడు మాసాలుగా కూలి డబ్బులు చెల్లించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. వేతన బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పితాని నాగేశ్వరరావు, భావన సంజీవరావు, జుత్తిగ పద్మ, సకిలే శేషకుమారి, జుత్తిగ శ్రీనివాసు, కుక్కల చిన వెంకన్న, బంటుమిల్లి కుమారి, వనచర్ల కృష్ణ పాల్గొన్నారు.

జ్యూయలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు శుభ పరిణామం

వేగ జ్యూయలరీ ఎగ్జిబిషన్ ప్రారంభంలో ఎంఎల్ఎ అంజిబాబు

భీమవరం టౌన్ : జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న భీమవరం పట్టణంలో జ్యూయలరీ ఎగ్జిబిషన్‌ను రెండురోజులపాటు నిర్వహించడం శుభ పరిణామమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం పాల్కన్ నెస్ట్ హోటల్లో శనివారం వేగ జ్యూయలరీ ఆధ్వర్యంలో హాఫ్ శారీ అండ్ వెడ్డింగ్ జ్యూయలరీ ఎగ్జిబిషన్‌ను ఎంఎల్ఎ అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఒకే చోట ఎన్నో రకాల ఆభరణాలను మహిళలకు అందుబాటులోకి తీసుకోవడంపై వేగ జ్యూయలరీ వారిని ఎంఎల్ఎ అభినందించారు. వేగ జ్యూయలరీ మేనేజర్ బాల దుర్గాప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ సింహాచలం, మార్కెటింగ్ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రెండురోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని, మహిళలకు మెచ్చే అన్ని రకాల ఆభరణాలను ఈ ప్రదర్శనలో ఉంచామని అన్నారు. లక్కీ డ్రా విన్నర్‌కు గోల్డ్ కాయిన్ బహుమతిగా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బండి రమేష్ కుమార్, అశోక్, నసీమా పాల్గొన్నారు.

తెలుగు జాతి ఆత్మగౌరవ దినోత్సవంగా ప్రకటించాలని వినతి

తణుకు : డాక్టర్ నందమూరి తారక రామారావు(ఎన్‌టిఆర్) జన్మదినోత్సవాన్ని తెలుగు జాతి ఆత్మగౌరవ దినోత్సవంగా నిర్వహించాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. శనివారం తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ ఆత్మగౌరవం దినోత్సవంపై చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణను కోరారు. రాధాకృష్ణ స్పందింస్తూ తప్పకుండా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం బివి రామ్ రాధాకృష్ణను శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామ్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జన్మదినమైన మే 28వ తేదీ తెలుగు ప్రజలు అందరూ గుర్తించుకొనే విధంగా తెలుగుజాతి ఆత్మగౌరవం దినోత్సవంగా జరుపుకోవడం ద్వారా నిజమైన నివాళి అర్పించినట్లని అన్నారు. ఈ సమావేశంలో బలుసు శ్రీనివాస్, వైఆర్‌వి.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐఐటి, నీట్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం శశి క్యాంపస్‌లో శనివారం 6, 7, 8, 9, 10, ఇంటర్‌లో చేరే విద్యార్థులకు ఐఐటి, నీట్ విద్యపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఐక్యూ ఆధారంగా మార్కులు, ర్యాంకులు సాధించగలుగుతారని, కాబట్టి తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకూడదన్నారు. మా శశి విద్యాసంస్థలలో విద్యార్థులు రాణించగలిగే కోర్సులలోనే కోచింగ్ ఇస్తామన్నారు. శశి విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమన్నారు. విద్యార్థిని శక్తిగా తయారు చేయాలని అన్నారు. అనంతరం సందేహాలను నివృత్తి చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. శశి విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, క్యాంపస్ ఇన్‌ఛార్జి కె.జగదీష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పు మాత్రం మిగిలింది : కారుమూరి

తణుకు : కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు దాటిందని, లక్షా 50 వేల కోట్ల రూపాయల అప్పులు మాత్రం మిగిలాయని మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ప్రభుత్వాన్ని విమర్శించారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ ఈ 10 నెలల్లో ఏమీ చేశారంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని అన్నారు. చదువులో, రైతులకి ఇస్తానన్న భరోసా, తల్లికి వందనం అటకెక్కాయని తెలిపారు. ఈ డబ్బు ఏమీ చేస్తున్నారో తెలియదు గాని, రాష్ట్రాన్ని నిలువునా ముంచేస్తున్నారని విమర్శించారు. జగన్ చేసేవి అన్ని అబద్ధాలని, ఇవి అన్ని బాబు వచ్చాక చేస్తారని లాండ్ టైటిలింగ్ యాక్టు ద్వారా అన్ని తాకట్టు పెట్టేస్తారని అబద్ధాలు చెప్పించారన్నారు. ఈ చంద్రబాబునాయుడు మన తల్లిని అన్నింటిని తాకట్టు పెడుతున్నాడని విమర్శించారు. సంపద సృష్టిస్తానంటే ఏరకంగా సృష్టిస్తారో అనుకున్నామని, కానీ మద్యాన్ని ఏరులై పారిస్తూ దారుణంగా అమ్ముతున్నారన్నారు. మీ సొంత గ్రామమైన వేల్పూరులో ఒక శెట్టిబలిజ కుర్రోడుని మీ బెల్ట్ షాపు దగ్గర దారుణంగా చంపారని, కనీసం పలకరించడానికైనా వెళ్లలేదని ఎంఎల్‌ని ప్రశ్నించారు. కేసు ఏమైందో ఇంకా తెలియలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో రిక్షా యూనియన్ అధ్యక్షునిగా భాస్కరరావు

నరసాపురం : మండలంలోని పసలదీవి గ్రామంలో శ్రీసిద్ధి వినాయక ఆటో రిక్షా ఓనర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ ఎన్నికలు శనివారం గ్రామంలోని వినాయక గుడి వద్ద నిర్వహించారు. సాధారణ ఎన్నికలు మాదిరిగా ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్స్, సీక్రెట్ పద్ధతిలో, కౌంటింగ్, ఎన్నికల గుర్తు కేటాయింపు, ఎన్నికల అధికారులతో ఎన్నిక జరిగింది. పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొగల్తూరు పోలీసుల బందోబస్తు సైతం ఏర్పాటు చేశారు. నరసాపురం నుంచి పేరుపాలెం స్టాండ్ అధ్యక్షుడు పదవికి పోటీ ఏర్పడింది. ఎన్నికల్లో గెలిచిన వ్యక్తి ఒక సంవత్సరం కాలం పాటు పదవిలో అధ్యక్షుడుగా పనిచేస్తారు. మొత్తం 236 ఓట్లు ఉండగా 190 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవి కోసం కలిసిపూడి ప్రసాద్, లక్కవరపు భాస్కర్ రావు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ పోటీలో కలిసిపూడి ప్రసాద్‌కు 94 ఓట్లు రాగా లక్కవరపు భాస్కర్ రావుకు 96 ఓట్లు వచ్చాయి. రసవత్తరమైన పోటీలో 2 ఓట్లు తేడాతో పేరుపాలెంకు చెందిన లక్కవరపు భాస్కర్ రావు యూనియన్ అధ్యక్షుడుగా గెలుపొందారు. భాస్కర్ రావును పలువురు యూనియన్ సభ్యులు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు.

నేడు ఆక్వారైతుల ధర్నా

గణపవరం : మండల కేంద్రమైన గణపవరంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఆక్వా రైతులు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆక్వా రైతులు తెలిపారు. ప్రస్తుతం రొయ్య ధర రేటు తగ్గిపోవటం, విద్యుత్ సమస్య, మేత ధరలు తగ్గించాలని కోరుతూ గణపవరం పోలీస్ సెంటర్ వద్ద ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా నాణ్యత కలిగిన సీడ్‌ను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆక్వా రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, పెనుగొండ చెరుకువాడ గ్రామానికి చెందిన కండిబోయిన వెంకట రామకృష్ణ పాస్‌పోర్ట్ నెం – **X3802151** తీసుకుని గాంధీ బొమ్మల సెంటర్ జిరాక్స్ నిమిత్తం వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్: కండిబోయిన వెంకట రామకృష్ణ
S/o. కండిబోయిన వెంకటేశ్వరరావు
డోర్ నెం. 29-69, పెచ్చేటి వారి వీధి
చెరుకువాడ. పెనుగొండ గ్రామం
పెనుగొండ మండలం
పశ్చిమగోదావరి జిల్లా-534320
సెల్: 98483 51282

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం, ఐనపర్రు గ్రామానికి చెందిన కొవ్వూరి పెద్ద శ్రీను, S/o వీర్రెడ్డి అను నేను నా యొక్క **పాస్‌పోర్టు నెం. F8102044.** గల పాస్‌పోర్ట్ ఐనపర్రు నుండి ఇరగవరం ఈ సేవ దగ్గరకి వెళ్ళుచుండగా నా యొక్క పాస్‌పోర్టు మార్గ మధ్యలో పడిపోయింది. నేను వెళ్ళిన మార్గ మధ్యలో, చుట్టుప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా పాస్‌పోర్టు దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకి తెలియజేయగలరు.

కొవ్వూరి పెద్దశ్రీను
S/o. వీర్రెడ్డి
ఐనపర్రు గ్రామం
ఇరగవరం మండలం, ప॥గో॥జిల్లా
సెల్ నెం: 89781 51142

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. No. 24/2023 in O.S. No. 240/2021

Between:
బూరాబత్తుల శ్రీనివాసరావు ...పిటీషనరు/డిక్రీ హోల్డర్
And
1. పాలా శ్రీనివాసరావు @ శ్రీనివాస్
2. పాలా ఝాన్సీ ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టర్

To:
R-1: 1. పాలా శ్రీనివాసరావు @ శ్రీనివాస్, తండ్రి: వెంకటరావు, వయస్సు 47 సం॥, పురుషుడు, వ్యాపారం, డోర్ నెంబర్ 10-109/1, అంబటివానిచెరువు, H/o పోడూరు, పోడూరు మండలం.

పై నెంబరు పిటిషనులో 1వ రెస్పాండెంటు/1వ జడ్జిమెంట్ డేటర్ హాజరు నిమిత్తం **ది.23-04-2025 సం.తేదికి** వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10-30 ని॥లకు** స్వయముగా కానీ, న్యాయవాది గారి ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పిటిషను ముందు గ్రంధము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు న్యాయవాది
తేది:27-03-2025 పాలకొల్లు, ప॥గో॥జిల్లా